సాక్షి
తిరుపతి

శనివారం । 25 । మార్చి । 2023



వర్షం

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉక్కపోతతో అవస్థలు పడ్డ జనానికి వర్షం ఉపశమనం కలిగించింది.



టీబీతో ముప్పు

రామకుప్పం: విజలాపురం పీహెచ్‌సీ పరిధి, ఆనిగానూరులో వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



శాస్త్రోక్తంగా చండీహోమం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీకాళికాదేవి సన్నిధి వద్ద శుక్రవారం శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. వేదపండితులు కలశ స్థాపన, హోమపూజలు నిర్వహించారు.



న్యూస్‌రీల్

ఆదివారమూ పనిచేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

చంద్రగిరి: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆదివారం కూడా విధులు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు యథావిధిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో వినియోగదారులు చలానాలను చెల్లించేందుకు ఇబ్బందులు తలెత్తకుండా స్టేట్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సిబ్బంది కూడా విధులకు హాజరవుతారన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, కొత్తపాళ్లెం గ్రామ రెవెన్యూలో ఏర్పాటు చేయనున్న శ్రీ సత్తి వెంకటసత్యనారాయణరెడ్డి రోడ్డుమెటల్ అండ్ బిల్డింగ్ స్టోన్ మెటల్ ఇండస్ట్రీస్‌పై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో డీఆర్వో శ్రీనివాసులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కొత్తపాళ్లెం రెవెన్యూ పరిధిలోని సర్వే నం.84, 382లోని 8.71 హెక్టార్లలలో, ఆలత్తూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.513, 516, 517లోని 10.72 హెక్టార్లలో రోడ్డు మెటల్ అండ్ బిల్డింగ్ స్టోన్ మెటల్ ఇండస్ట్రీస్‌ను నిర్మిస్తోందని తెలిపారు. అనంతరం గ్రామస్తుల నుంచి ప్రజాభిప్రయాన్ని సేకరించారు. మెటల్ లారీల వల్ల రోడ్డు దెబ్బతింటుందని, క్వారీ వాహనాల వల్ల దుమ్ముతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్ర, తహసీల్దారు పీవీ సుబ్రమణ్యం, గ్రామ కార్యదర్శి స్వర్ణమంజరి, వీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

28న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 28వ తేదీ మంగళవారం హుండీ కానుకలు లెక్కించనున్నట్లు ఈవో సాగర్‌బాబు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను కూడా లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి, డీఈఓ శేఖర్

రేణిగుంట: జగనన్న ప్రభుత్వంలో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ×సిపాయి విద్యా దీవెన॥ పేరిట 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన డీఈఓ శేఖర్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులతో చదువులు సమస్యల వలయంలో సాగేవన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఎంఈఓ ఇందిరాదేవి, హెచ్‌ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

పిచ్చాటూరు: అరణియార్ వద్ద పర్యాటక అభివృద్ధి పనులకు ఇరిగేషన్ అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఇరిగేషన్‌శాఖ శ్రీకాళహస్తి ఈఈ మదనగోపాల్ నేతృత్వంలో ఇంజినీరింగ్ బృందం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అరణియార్ కట్ట వద్దకు చేరుకుంది. తుడా మంజూరు చేసిన రూ.1.8 కోట్లతో పనులు చేపట్టడానికి స్థలాన్ని గుర్తించారు. ఈఈ మదనగోపాల్ మాట్లాడుతూ తుడా నిధులతో పర్యాటక అభివృద్ధి పనులకు టెండర్ల దశ పూర్తయిందని, వచ్చే వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు.



తిరువీధి ఉత్సవంలో ఉభయనాంచారీ సమేత మత్స్యావతారమూర్తి

వేదనారాయణ స్వామి మత్స్యజయంతి ఉత్సవంలో ఇరుముడులు చెల్లించేందుకు వస్తున్న మత్స్యకారులు



నేత్రపర్వం.. సూర్యపూజ తెప్పోత్సవం



తెప్పపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామి

- ఉదయం మత్స్యజయంతి వేడుకలు
- రాత్రి స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం
- సూర్యపూజ తెప్పోత్సవాలకు పోటెత్తిన భక్తులు

పిచ్చాటూరు: నాగలాపురంలోని శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో సూర్యపూజ తెప్పోత్సవాలు శుక్రవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. మొత్తం ఐదు రోజుల పాటు జరగనున్న ఈ మహోత్సవాలలో తొలిరోజు సాయంత్రం ఆకాశం మబ్బులతో ఉండడంతో సూర్యకిరణాల ప్రసరణకు అంతరాయం ఏర్పడింది. కిరణాలు ప్రసారమయ్యే సమయాన్ని గుర్తించి ఆలయ పరిచారికలు సూర్యకిరణ ప్రసార మార్గాన్ని మంత్రజలంతో అభిషేకించి స్వామి వారికి హారతులిచ్చారు. సూర్యకిరణాలు ఆలయంలోకి ప్రసరించడాన్ని తిలకించడానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఉభయనాంచారీల సమేత శ్రీ మత్స్యావతారమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం నుంచి పుష్కరిణి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు.

వైభవంగా మత్స్య జయంతి

ఆలయంలో శుక్రవారం మత్స్యజయంతి వేడుకగా నిర్వహించారు. నెల్లూరు, ఒంగోలు జిల్లాల్లోని సముద్ర తీర ప్రాంతాల నుంచి వందలాది మంది మత్స్యకారులు ఇరుముడులతో గురువారం రాత్రి ఆలయానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ అర్చకులు తోమాల సేవ, అర్చన నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామి మత్స్య జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ తిరువీధి ఉత్సవంలో మత్స్యకారులు ఇరుముడితో స్వామి, అమ్మవార్లను దర్శించి తరించారు. అనంతరం ఆలయంలో ఇరుముడులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. 9 గంటలకు శాంతి హోమం, 11 గంటలకు స్వామి, అమ్మవార్ల స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆర్‌డీఓ రామారావు మత్స్యజయంతి పూజల్లో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి, నాగలాపురం, సత్యవేడు, పిచ్చాటూరు ఎస్‌ఐలతో పాటు 60 మంది పోలీసు సిబ్బంది, టీటీడీ విజిలెన్స్‌తో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌గా పుంగనూరు



సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప

- ముఖ్యమంత్రి సహకారంతో అభివృద్ధి
- 2వేల ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి



ఫ్యాక్టరీ పనులను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, కంపెనీ ఎండీ కేజ్రీవాల్

పుంగనూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో పుంగనూరును ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇందుకోసం 2వేల ఎకరాలను కేటాయించేందుకు నివేదిక పంపినట్లు వెల్లడించారు. శుక్రవారం మండలంలోని ఆరడిగుంట వద్ద ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ వారి పైపుల ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్పతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రూ.160కోట్ల వ్యయంతో 56 ఎకరాల్లో పైపుల ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారన్నారు. 500 మందికి ప్రత్యక్షంగా, 800 మందికి పరోక్షంగా ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. పరిశ్రమ కోసం ప్రత్యేకంగా 133 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేశామన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఒక్క ఇంధనశాఖకు మాత్రమే రూ.9లక్షల కోట్లకు ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించారు. గతంలో చంద్రబాబు ఎవరో అనామకులను తీసుకువచ్చి ఎంఓయూలు చేయించి పంపేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు దేశంలోనే దిగ్గజ పారిశ్రామిక వేత్తలైన ముఖేష్ అంబానీ లాంటి వారు సమ్మిట్‌కు హాజరై రూ.13లక్షల కోట్ల పెట్టుబడులకు హామీ ఇవ్వడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు నిదర్శనమని కొనియాడారు.

ప్రజలకే జవాబుదారీ..

అభివృద్ధిపై ప్రజలకే జవాబుదారీగా ఉంటామని, సోషల్ మీడియాలో విమర్శలు చేసేవారిని పట్టించుకునే ప్రసక్తే లేదని ఎంపీ పెద్దిరెడి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. పైపుల పరిశ్రమ భూమి పూజ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా నీటి సమస్యలు తలెత్తకుండా నేతిగుట్లపల్లె, ఆవులపల్లెలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే హంద్రీ–నీవా కాలువ విస్తరణతోపాటు గాలేరు నుంచి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో పరిశ్రమలకు స్వర్గధామంగా పుంగనూరు వర్ధిల్లుతుందని తెలిపారు. ఈ క్రమంలోనే పుంగనూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఫ్యాక్టరీ ఎండీ కేజ్రీవాల్‌ను మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి , ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాయలసీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్ షరీఫ్, సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ సభ్యుడు నంజుండప్ప పాల్గొన్నారు.

భూగర్భ జలాలను పరిరక్షిస్తాం



బోరు బావుల్లో భూగర్భ జలాలపై శిక్షణ ఇస్తున్న భూగర్భ జల, జలగణన శాఖ అధికారులు

ఏర్పేడు: రాష్ట్రంలో భూగర్భ జలాలను పరిరక్షిస్తామని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో భూగర్భ జల క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల్లో చోటుచేసుకున్న మార్పులు, బోరుబావుల పనితీరును శాస్త్రీయ రీతిలో అధ్యయనం చేసేందుకు రాష్ట్ర భూగర్భ జల, జల గణనశాఖ హైడ్రాలజీ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 26 ప్రాంతాల్లో 117 పరిశీలక బావులను నిర్మించినట్లు వివరించారు. ఆయా ప్రాంతాల్లో బోరుబావుల పనితీరును అధ్యయనం చేయడం, తద్వారా భూగర్భ జలాల యాజమాన్యానికి శాస్త్రీయ పద్ధతిలో ప్రణాళికలను రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కేంద్ర భూగర్భ వనరుల బోర్డు నుంచి అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ జరుగుతుందన్నారు. భూగర్భ జలశాఖ అభివృద్ధి చెందిన సాంకేతిక మెలకువలను కాలానుగుణంగా మార్పులకు లోనవుతున్న భూగర్భ జలాల లభ్యతను, భూగర్భ జల మట్టాలకు నీటి నాణ్యత పరిశీలక అధ్యయనానికి అన్వయిస్తున్నట్లు చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అగ్రగామిగా నిలుస్తూ భూగర్భ జల పరిరక్షణకు, సమగ్ర వినియోగానికి అవసరమైన సాంకేతిక సమాచారాన్ని నీటి వినియోగదారులు, నీటి సంబంధిత శాఖలు, శాస్త్రవేత్తలకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్‌పీఎంయూ, ఎస్‌హెచ్‌పీ సీనియర్ జాయింట్ కమిషనర్ జ్ఞానసుందర్, రాష్ట్ర భూగర్భ జల, జల గణనశాఖ సంచాలకుడు ఎం.జాన్‌సత్యరాజు, సంయుక్త సంచాలకుడు శ్రీనివాసు, హైదరాబాద్‌శాఖ నాబార్డ్ కన్సల్టెంట్ శిల్పదేశ్‌పాండే, కేంద్ర భూగర్భ జల వనరుల ప్రాంతీయ సంచాలకుడు సిద్ధార్థ్‌కుమార్ పాల్గొన్నారు.

28న ఏజీ పెన్షన్ అదాలత్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఈ నెల 28న విజయవాడకు చెందిన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ నేతృత్వంలో నిర్వహిస్తారని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పింఛన్లు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటి, ఫ్యామిలీ వెల్ఫేర్ రిటర్న్స్, మిస్సింగ్ డెబిట్స్ తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. అదనపు సమాచారం కోసం జిల్లా ఖజానా అధికారి 9440013592 వారిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇంటర్ పరీక్షకు 828 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్–2బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 141 పరీక్షా కేంద్రాల్లో జనరల్‌లో 32,381 మంది, ఒకేషనల్‌లో 3,113, మొత్తం 35,494 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. వీరిలో 828 మంది గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ వీ.రమేష్ తెలిపారు. ఈ పరీక్షల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష జరుగుతుందని ఆర్‌ఐఓ తెలిపారు.

గరుడ వాహనంపై కోదండరాముడి అభయం



గరుడ వాహన సేవకు పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారివార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం రాత్రి స్వామివారు గరుడ వాహనధారుడై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. భజనలు, మంగళవాయిద్యాల నడుమ, భక్తుల రామనామస్మరణతో జగదభిరాముడి గరుడ సేవ కోలాహలంగా సాగింది. ఉదయం స్వామివారి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహినీ అవతారధారుడైన శ్రీరామచంద్రుడు పల్లకీలో కొలువై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. గరుడ వాహనసేవలో చిన్న జీయర్ స్వామి, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు. పెద్ద జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్నం, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం

- ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి
- జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తదితరులు

తిరుపతి తుడా : జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని, క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి 95 శాతం మందికి వ్యాధి నుంచి ఉపశమనం కలిగించినట్టు తెలిపారు. మందులతో పాటు ఆరు నెలలకు సరిపడే పోషకహార వస్తువులను అందజేశామని గుర్తుచేశారు. క్షయవ్యాధి లక్షణాలు అధికంగా ఉన్న వారికి హెచ్‌ఐవీ పరీక్షలు సైతం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. క్రమంతప్పకుండా మందులను సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. క్షయవ్యాధి లక్షణాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా క్షయవ్యాధి బాధితులను గుర్తించామన్నారు. తిరుపతి, చంద్రగిరి, పుత్తూరు, రేణిగుంట, సత్యవేడు, శ్రీకాళహస్తి, గూడూరు, కోట, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేటల్లో క్షయవ్యాధి యూనిట్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. గత ఏప్రిల్ నుంచి నిర్వహించిన పరీక్షల్లో 5,729 మంది వ్యాధి గ్రస్తులు ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. ఇందులో 5,268 మందికి వైద్య చికిత్సలు అందించామని, అందరికీ హెచ్‌ఐవీ పరీక్షలు సైతం చేపట్టినట్టు వెల్లడించారు. టీబీ కంట్రోల్ అధికారి అరుణ సులోచనదేవి, వైద్యాధికారులు శ్రీనివాసరావు, హనుమంతరావు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడు, ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, పలమనాలజిస్ట్ డాక్టర్ సుబ్బారావు, లైన్స్‌క్లబ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోజూ అర్జీల స్వీకరణ

తిరుపతి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో రోజూ సాయంత్రం 3–5 గంటల సమయంలో అర్జీలను స్వీకరించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్చువల్ విధానంలో అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులతో కలెక్టర్ పలు అంశాలపై సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు వారానికి ఒకసారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నెలకు ఒకసారి, మహిళా పోలీసులు నెలకు ఒకసారి వారి పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. సమస్యలను కన్సిస్టెంట్ రిథమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డీఈఓ వీ.శేఖర్, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, సీపీఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు దగ్గరవ్వండి



మాట్లాడుతున్న తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

వరదయ్యపాళెం: ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు దగ్గర కావాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం శ్రీసిటీలో గూడూరు, నాయుడుపేట, శ్రీసిటీ సబ్ డివిజన్ల పోలీసు అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నేరాలు, శాంతిభద్రతలు, విజిలెన్స్‌పై ఎస్పీ సమీక్ష జరిపారు. ఆయా ప్రాంతాల్లో నేర నిరోధక తనిఖీలు నిర్వహించాలని, వివిధ ముఠాల చుట్టూ ఉచ్చు బిగించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులు, తాజా ఫిర్యాదులు, విచారణలు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు, నోటీసులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై సకాలంలో కోర్టు ఆదేశాలు అమలయ్యేలా, నోటీసులు అందేలా చూడాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అధికారులకు సూచనలు చేస్తూ ఫిర్యాదులతో పోలీస్ స్టేషన్లకు వచ్చే వారితో మంచిగా ప్రవర్తించాలని కోరారు. ఏఎస్పీలు వెంకటరావు (అడ్మిన్), బీహెచ్ విమలకుమారి(నేర విభాగం), డీఎస్పీలు సురేంద్ర రెడ్డి (స్పెషల్ బ్రాంచ్), జగదీష్ నాయక్ (శ్రీసిటీ), పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తిరుపతి టు తిరువణ్ణామలైకి ప్రత్యేక సర్వీసులు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ తమిళ నాడులోని తిరువణ్ణామలైకి తిరుపతి నుంచి మంగళం డిపోకి చెందిన పలు సర్వీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ భాస్కర్ తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ తిరుపతి నుంచి తిరువణ్ణామలైకు ఉదయం 10.30 గంటలకు, రాత్రి 11.55 గంటలకు ఇంద్ర ఏసీ సర్వీస్‌ను, మధ్యాహ్నం 2.30కు సూపర్ లగ్జరీ, సాయంత్రం 4.30కు సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్ 6న తిరువణ్ణామలై నుంచి తిరుపతికి ఉదయం 6.30 గంటలకు సూపర్‌లగ్జరీ, 9కు సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

దారి సమస్య పరిష్కరిస్తారా..
ప్రాణాలు తీసుకోమంటారా?

- చిందేపల్లె గ్రామస్తుల హెచ్చరిక
- పురుగు మందు డబ్బాలతో ఆందోళన
- గ్రామనిర్బంధం చేసిన పోలీసులు


పురుగు మందు డబ్బాలు చూపుతున్న గ్రామస్తులు

ఏర్పేడు: 'దారిసమస్య పరిష్కరించండి.. లేదా పురుగు మందు తాగి అయినా చావనీయండి' అంటూ ఏర్పేడు మండలం, చిందేపల్లె వాసులు భీష్మించుకున్నారు. ఈ మేరకు తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకోవడానికి బయలుదేరగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు పురుగు మందు డబ్బాలు చేతబట్టి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతామని హెచ్చరించారు. 80 ఏళ్లుగా గ్రామం నుంచి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ కర్మాగారం మధ్యలో ఉన్న రోడ్డు రాకపోకలకు ఉపయోగిస్తున్నామని, కానీ ఈ నెల 18న కర్మాగారం యాజమాన్యం రోడ్డుకు అడ్డంగా గోడ కట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఆర్డీఓ, కలెక్టర్‌కు విన్నవించగా మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీహరి మాట్లాడుతూ ఇంతమంది జనాలు కలెక్టరేట్‌కు వెళ్లరాదని సూచించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు గ్రామంలో ఉండి తిరుపతికి వెళ్లకుండా గ్రామస్తులను నిలువరించారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీహరి


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,630
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,505

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,900
రిటైల్ వెండి గ్రాము	రూ.73.90

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	25
చిత్తూరు	35	24
తిరుమల	31	21
గూడూరు	36	26
నగరి	36	26

మహిళా వర్సిటీలో సదర్వ-2కే23

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సదర్వ-2కే23 పేరుతో ఏర్పాటుచేసిన రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వీరికి రెండు రోజుల పాటు పేపర్, పోస్టర్ ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ క్విజ్, టెక్నికల్ గేమ్స్ వంటి పోటీలను నిర్వహించనున్నారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్.సత్యనారాయణ, మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పీ.మల్లికార్జున, ఈసీఈ విభాగపు ప్రొఫెసర్ పీ.సత్యనారాయణ, కన్వీనర్ ప్రశాంతి, కో-కన్వీనర్ డాక్టర్.సాయిసునీల్ పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న టూరిజం ఆర్‌డీ, ప్రిన్సిపల్ రమణప్రసాద్

తిరుపతి అలిపిరి: కేంద్ర, రాష్ట్ర టూరిజం శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషియన్, తిరుపతి కళాశాలలో వివిధ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టూరిజం ఆర్డీ ప్రిన్సిపల్ రమణప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎస్‌ఐహెచ్‌ఎం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌సీహెచ్‌ఎం జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ - 2023 మే 14న ఉంటుందని, అర్హత సాధించిన వారు మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ కోర్సులో చేరవచ్చన్నారు. పెద్దపెద్ద హోటల్స్‌లో ఇంటర్న్‌షిప్ పొందవచ్చని, ఆ సమయంలో ఉచిత వసతి, భోజనంతోపాటు స్కాలర్‌షిప్ మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. మూడేళ్ల బీఎస్సీ కోర్సుతో పాటు, ఒకటిన్నర సంవత్సరం క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ ఉంటుందన్నారు. పది, ఇంటర్ పాస్ అయినవారు, డిగ్రీ ఫెయిల్ అయిన 25 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 28 ఏళ్ల వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఇతర వివరాలకు అడ్మిషన్ కో-ఆర్డినేటర్ శివరామకృష్ణ 9700440604, 9100558006, 9701343846 సంప్రదించవచ్చన్నారు.

రేపు అండర్-17 జిల్లా స్థాయి చెస్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 26వ తేదీన గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలల నిర్వహించనున్నారు. ఆ మేరకు చీఫ్ ఆర్బిటర్ శ్రీనివాస్ సూరి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన బాలబాలికలను రాష్ట్ర స్థాయి అండర్-17 ఫెడ్ రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 2006, జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని, పాల్గొనదలచిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీసీహెచ్‌ఈఎస్‌ఎస్.ఓఆర్‌జీ వెబ్‌సైట్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98852 38474 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

జరిమానాతో రూ.1.27కోట్లు వసూలు


ఉదయరామ్ సింగ్, ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్

తిరుపతి అర్బన్: రైల్వే ప్రయాణం అంటే కొందరు ఎవరూ పట్టించుకోరులే అనుకుంటారు. టిక్కెట్ తీసుకోకుండా ప్రయాణం చేస్తుంటారు. మరికొందరు జనరల్ టిక్కెట్ తీసుకుని రిజర్వేషన్ బోగీలో జర్నీ చేస్తుంటారు. ఇలాంటి వారికి సింహస్వప్నంలా తయారయ్యారు ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉదయరామ్‌సింగ్. తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ నేతృత్వంలో పనిచేస్తున్న ఆయన 2022 జనవరి నుంచి 2023 ఫిబ్రవరి వరకు 17,321 మందికి అపరాధ చలానా ఇచ్చారు. వారి నుంచి రూ.1.27 కోట్లు వసూలు చేశారు. ఆ మేరకు నగదును రైల్వేశాఖకు చెల్లించారు. దీంతో ఆయనను గుంతకల్లు డివిజన్ ఉన్నతాధికారులే కాకుండా స్టేషన్ డైరెక్టర్‌తోపాటు స్టేషన్ మేనేజర్ రత్నానాయక్, సీటీటీఐ రాఘవేంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, ఈశ్వర్, గిరి తదితరులు అభినందించారు. గతంలోనూ ఉదయరామ్‌సింగ్ ఉత్తమ సేవలకు పలు అవార్డులు అందుకున్నారు.

గంజాయి తరలిస్తున్న టీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అరెస్ట్

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఈబీ పోలీసులు

తిరుమల : తిరుమలకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న టీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని తిరుమల ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతికి చెందిన జి.గంగాద్రి తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని లగేజీ కౌంటర్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఇతను ఉదయం తిరుపతిలోని అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఓ బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్‌ఈబీ అధికారులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 15 ప్యాకెట్లలలో నింపిన 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. వెంటనే అతడిని స్టేషన్‌కు తరలించిన విచారణ ప్రారంభించారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం


పలమనేరు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలివస్తున్న మద్యంపై ఉక్కు పాదం మోపాలని అడిషినల్ సూపరిండెంటెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా సెబ్ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ చెక్‌పోస్టు, రాష్ట్ర సరిహద్దులోని బార్డర్ చెక్‌పోస్టును సందర్శించారు. అక్కడున్న అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. స్థానిక సెబ్ సీఐ ఎల్లయ్య, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

టమాట గ్రేడింగ్ యంత్రం పరిశీలన



టమాట గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన టమాట గ్రేడింగ్ యంత్రాన్ని సంయుక్త పరిశీలన బృందం శుక్రవారం పరిశీలించింది. సరుకు గ్రేడింగ్‌కు ట్రయల్‌రన్ చేపట్టింది. సభ్యులు మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారా సైజుల వారీగా టమాటాలను బాక్సుల్లో నింపవచ్చన్నారు. బృందంలో కడప సంయుక్త మార్కెటింగ్ సంచాలకుడు రామాంజనేయులు, ఈఈ నసీం, డాట్ ఎంట వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వీఆర్వో కనిపించడంలేదంటూ పోస్టర్లు



జయంపు వీఆర్వో కనిపించడం లేదంటూ పోస్టర్ అంటించిన గ్రామస్తులు


రిజిస్టర్‌లో శుక్రవారం వరకు సంతకాలు పెట్టని వీఆర్వో

వెంకటగిరిరూరల్ (బాలాయపల్లి): బాలాయపల్లి మండలం, జయంపు గ్రామ సచివాలయ ఇన్‌చార్జి వీఆర్వో కృష్ణయ్య కనిపించడం లేదంటూ స్థానికులు పోస్టర్లు అంటించడం కలకలం రేపింది. ఆయన అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు విసుగెత్తి ఇలా పోస్టర్లు వేసినట్టు తెలుస్తోంది. ఈ మేరకు శుక్రవారం జయంపు సచివాలయ వీఆర్వో కనిపించడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆపై సచివాలయానికి పోస్టర్లు అంటించి వెళ్లిపోయారు.

వేధిస్తున్న వీఆర్వోల కొరత

బాలాయపల్లి మండలం పరిధిలో 51 రెవెన్యూ గ్రామాలు ఉండగా అందులో 15 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వో ఉండాల్సి ఉంది. కానీ స్థానికంగా ఏడుగురు మాత్రమే వీఆర్వోలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రెండు రోజుల్లో రెగ్యులర్ వీఆర్వోను నియమిస్తాం

బాలాయపల్లి మండల పరిధిలో వీఆర్వోల కొరత ఉంది. దీంతో కొన్ని సచివాలయాలకు ఇన్‌చార్జి వీఆర్వోలను నియమించాం. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. జయంపు సచివాలయానికి మరో రెండు రోజుల్లో రెగ్యులర్ వీఆర్వోను నియమిస్తాం.

\- శ్రీనివాసులు, తహసీల్దార్, బాలాయపల్లి

నిజాయితీ చాటుకున్న పంచాయతీ కార్మికుడు


పోగొట్టుకున్న నగదును బాధితులకు అందిస్తున్న రేణిగుంట సర్పంచ్

రేణిగుంట: రేణిగుంట గ్రామ పంచాయతీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుడు శ్రీనివాసులు తనకు దొరికిన నగదును బాధితులకు అందించి నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద తిరుపతికి చెందిన రాజశేఖర్, వర్ష భోజనం ప్యాకెట్ అని భావించి తమ వద్దనున్న రూ.1.39 లక్షల నగదును పంచాయతీ కార్మికుడు శ్రీనివాసులుకు ఇచ్చి వెళ్లిపోయారు. అయితే భోజనం చేసేందుకు కూర్చుని శ్రీనివాసులు కవర్ తెరిచి చూడగా, అందులో నగదు కట్టలు కనిపించాయి. విషయాన్ని పంచాయతీ పారిశుద్ధ్య కార్మిక నాయకుడు సుబ్బరాజుకు తీసుకెళ్లారు. ఆయన సర్పంచ్ నగేషం దృష్టికి తీసుకెళ్లి నగదు పోగొట్టుకున్న వ్యక్తుల వివరాలను కనుక్కొని వారిని పంచాయతీ కార్యాలయానికి పిలిపించి గంట వ్యవధిలోనే అందజేశారు. వారు కార్మికుని నిజాయితీని గుర్తిస్తూ అందులోని రూ.15 వేలను ప్రోత్సాహకంగా అందించారు.

రోడ్డు విస్తరణకు శ్రీకారం


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

నాయుడుపేట: ఆసియన్ డెవలప్‌మెంట్ బృందం సౌజన్యంతో మేనకూరు సెజ్ తిమ్మాజి కండ్రిగ నుంచి పండ్లూరు జాతీయ రహదారి -5 వరకు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం పండ్లూరు, కొత్తపేట ప్రాంతాల్లో బృందం పర్యటించింది. 45 అడుగుల వెడల్పుతో 9 కి.మీ పొడవున రోడ్డును నిర్మించనున్నారు. స్థల సేకరణకు రైతులతో చర్చించారు. భూనిర్వాసితుల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. రైసెస్ ఎక్స్‌పర్ట్ పీ దేవరాజు, ఆర్ఆర్ స్పెషలిస్ట్ హర్షవర్ధన్, ఆర్అండ్‌బీ డెవలప్‌మెంట్ ఎల్‌ఏ అసిస్టెంట్ ఉదయ్‌శంకర్, ఆర్అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, డీఈఈ పరమేశ్వరి, ఏఈఈ చిన్నరాయుడు, ఇండస్ట్రియల్ ప్రతినిధులు భార్గవ్, మూర్తి, రత్తయ్య, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మేధో హక్కుల రక్షణ అవసరం


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న విద్యావేత్తలు

చిత్తూరు కలెక్టరేట్ : మేధో సంపత్తి హక్కులను రక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చిత్తూరులోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల, న్యూఢిల్లీకి చెందిన ఎసీఎస్ఎస్ఆర్ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, కో-ఆర్డినేటర్ ఉషశ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ముఖ్యఅతిథి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో వినూత్నమైన అంశంతో జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎసీఎస్ఎస్ఆర్ ఎటువంటి సదస్సులకు ఆర్థిక సహాయం అందిస్తుంది, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలనే అంశాలను వివరించారు. మైసూర్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ నిరంజన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మేధావులు, విద్యావేత్తలు హక్కుల పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. అనంతరం జాతీయ సదస్సు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉషారాణి, రుక్మిణి, సురేఖ, తిరుకుమరన్, రమాదేవి, కిరణ్మయి, ఆనంద్ పాల్గొన్నారు.